# ఆదిలాబాద్ సూర్య

సూర్య 18వ వసంతంలోకి...

www.suryaa.com

సోమవారం 21 ఏప్రిల్ 2025 పేజీలు 03

★ మంచిర్యాల ★ నిర్మల్ ★ కొమురం భీం ఆసిఫాబాద్




భూ సమస్యల పరిష్కారానికే

## భూ భారతి చట్టం

**- అవగాహన సదస్సులో మంత్రి సీతక్క**

**ఖానాపూర్ సూర్య మేజర్ న్యూస్ :**



భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తూ, రైతుల భూములకు పూర్తి భరోసా కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం తెచ్చిందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క అన్నారు. భూభారతి (భూమి హక్కుల రికార్డు చట్టం)- 2025 పై శనివారం రాత్రి ఖానాపూర్ ఎం పి డి ఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక ఎం ఎల్ ఏ బొజ్జు పటేల్ కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ప్రజల భూ సమస్యలను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందన్నారు. ఈ చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవ్వడమే కాకుండా భవిష్యత్తులో భూ సమస్యలు, భూ వివాదాలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ప్రజల ప్రయోజనార్థం ప్రభుత్వం ఎన్నో రోజులు కసరత్తులు చేసి, రిటైర్డ్ ఉద్యోగులు రెవెన్యూ ఉద్యోగులు న్యాయ నిపుణుల అంశాలు పరిగణలోకి తీసుకొని, ఎన్నో సంప్రదింపుల తర్వాత ఈ భూభారతి చట్టం రూపు దాల్చిందన్నారు. గ్రామీణ స్థాయిలో భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ రెవెన్యూ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ( మిగితా... 2లో )

ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం అందుకోనున్న

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ ఏప్రిల్ 20,సూర్య మేజర్ న్యూస్**



ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ బ్లాక్ 2024 సంవత్సరానికి ప్రగతిశీల బ్లాక్ ప్రోగ్రాం కేటగిరీలో ఎంపిక కాగా ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం 2024లో దేశంలోని టాప్ 5 ఆస్పిరేషనల్ బ్లాకులలో ఒకటిగా ఎంపికైంది. దేశంలో 426 ఆస్పిరేషనల్ బ్లాకులలో నార్నూర్ అద్భుతమైన విజయాలను ప్రదర్శించి టాప్ ,5 గుర్తింపును సాధించింది. ఈ దేశస్థాయి పురస్కారం పరిపాలన అభివృద్ధిలో అద్భుతమైన పనిని సొంతం చేసుకున్న వారికి ఇవ్వబడుతుంది. ఏప్రిల్ 2022 నుంచి డిసెంబర్ 2024 వరకు చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి పనులపై మదింపు చేస్తుంది. ( మిగితా.... 2లో )

ప్రజలను దోచుకుంటున్న

## మెడికల్ షాపుల యాజమానులు

**- రోగులను పట్టిపీడిస్తున్న వైద్యులు**

**మంచిర్యాల/జన్నారం, ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్**

మంచిర్యాల్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో కొంతమంది మెడికల్ షాపు యాజమాన్లు ప్రైవేట్ డాక్టర్లతో కుమ్మక్కై మందుల కొనుగోలుదారులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో సుమారు 200 వరకు మెడికల్ షాపులు ఉండగా ఆయా మండల కేంద్రాల్లో సుమారు 10 మెడికల్ షాపులు ఉంటున్నాయి. లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్,నస్పూర్,చెన్నూర్, కోటపల్లి, బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రి, జన్నారం తదితర మండలాల్లో పదులకు పైగా మెడికల్ షాప్‌లు ఉన్నాయి. మండల కేంద్రాల్లో గల ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రోగులను పట్టిపీడిస్తున్నట్లు రోగులను పట్టిపీడిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు జిల్లా వైద్యశాఖ అధికారులు పర్యవేక్షించకపోవడంతోనే ఈ దవాఖానాల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైనట్లు పలువురు రోగులు చెబుతున్నారు. ఇందులో కొంతమంది యజమానులు డాక్టర్లతో కుమ్మక్కై డాక్టర్లకు పర్సంటేజీలు చెల్లిస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా డాక్టర్లు నడిపే క్లినిక్ ల అద్దె, కాంపౌండర్ల వేతనాలు చెల్లిస్తూ తమ షాపుల్లో మందుల అమ్మకాలు పెంచుకుంటున్నారు. దాంతో డాక్టర్లు అవసరం ఉన్న లేకపోయినా వేల రూపాయల మందులు రాస్తూ రోగులను ఆర్థికంగా కృంగదీస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.




మిగితా.2లో

వక్ఫ్ సవరణ చట్టం పై

## తప్పుడు ప్రచారం

**- పేద ముస్లింకు న్యాయం చేయడానికే వక్ఫ్ సవరణ చట్టం**

**- రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల టౌన్,సూర్య మేజర్ న్యూస్:**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టం పై తప్పుడు ప్రచారం తగదని బీజేపీ నాయకులు రఘునాథ్ హితావు పలికారు.వక్ఫ్ సవరణ చట్టం పై కాంగ్రెస్,ఎంఐఎం పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ ఆదివారం బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్,బీజేపీ నాయకులు రఘునాథ్ వెరబెల్లి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ను ప్రక్షాళన చేయాలనే ఉద్దేశంతో వక్ఫ్ ఆస్తులు పేద ముస్లింలకు దక్కాలనే ఉద్దేశంతో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకవస్తే,దాని పై కాంగ్రెస్,ఎంఐఎం,ఇతర ప్రతిపక్ష పార్టీలు తమ స్వలాభం కోసం బిల్లు పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.ఇన్ని రోజులు వక్ఫ్ ఆస్తుల పేరుతో కొన్ని సంపన్న ముస్లిం పెద్దలు అవినీతికి పాల్పడి ఆస్తులను దోచుకున్నారని అన్నారు. కానీ మోదీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులు ముస్లిం లో పేదలకు, వెనుకబడిన ముస్లింలకు కూడా ఈ ఆస్తులు చెందాలనే ఉద్దేశంతో ఈ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టి ఆమోదం పొందేందుకు కృషి చేశారని తెలిపారు.కానీ కొన్ని మతతత్వ పార్టీలు ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంక్ కోసం వక్ఫ్ పై ముస్లిం ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.ముస్లింలు ఎవరు కూడా వక్ఫ్ పై తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని వక్ఫ్ ఆస్తులు అందరికీ అందుబాటులో ఉండేలా మోదీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టి వెంకట కృష్ణ,కొయ్యల ఎమాజీ,గాజుల ముఖేష్ గౌడ్,తాజ్ ఖాన్,ఎనగందుల కృష్ణ మూర్తి,అమిరిశెట్టి రాజు,వంగపల్లి వెంకటేశ్వర్ రావు,మాసు రజిని,అక్కల రమేష్,రాకేష్ రెన్వ,బూర్ల చిరంజీవి,తదితరులు పాల్గొన్నారు.



## 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను అభినందించిన బెల్లంపల్లి ఏసిపి రవికుమార్

**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్.**

విద్యార్థులకు వేసవి సెలవు ప్రారంభం కావడంతో సొంతిల్లకు ప్రయాణించే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ సూచించారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉదయం జరిగిన చోరికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. హనుమాన్ నగర్ చెందిన ఇరుముల శరణ్య అనే మహిళా కిటికీ పక్కన పడుకున్న నేపథ్యంలో ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలు తాడు, అలాగే అదే కాలానికి చెందిన బుర్ర రాజేంద్రప్రసాద్ యొక్క మొబైల్ ఫోన్లు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఏసిపి రవికుమార్ తెలిపారు. సమాచార అందుకున్న పోలీసులు బృందాలుగా ఏర్పడి అనుమాన స్పదంగా తిరుగుతున్న పాత నేరస్తుడు గుంజ ఇమాన్యుల్‌నీ అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకోవడంతో కోర్టుకు హాజరుపరిచినట్లు ఏసిపి పేర్కొన్నారు.చోరీ జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు. ఈ సమావేశంలో మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్, కాసిపేట్ ఎస్సై ప్రవీణ్, కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.




ఇంద్రవెల్లి స్తూపం వద్ద నివాళులర్పించిన

## మంత్రి సీతక్క, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు

**అదిలాబాద్ (ఇంద్రవెల్లి), మేజర్ సూర్య న్యూస్:**

ఇంద్రవెల్లి అమరుల త్యాగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి తొలిసారిగా సభను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్ని జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని హిరాపూర్ గ్రామ సమీపంలో ఉన్న అమరవీరుల స్మారక స్థూపం వద్ద అసువులు బాసిన అమరవీరులకు ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా నీవాళ్లర్పించారు. ఈ మేరకు ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ 10 లక్షల విలువ గల ట్రైకర్ యూనిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అమరవీరుల సంస్మరణ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే ఒక కమిటీ ఏర్పటు చేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనాడు మరణించిన ఆదివాసి వీరులు తమ సొంత ప్రయోజనాలు కాకుండా జాతి ప్రయోజనాల కోసం పోరాటం చేశారన్నారు. వారి త్యాగాలను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తూ, గుర్తించి 44 ఏళ్ల తర్వాత అధికారికంగా సంస్మరణ సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. గుర్తించలేని మిగతా కుటుంబాలను కూడా ఐటిడిఏ పీఓ ఆధ్వర్యంలో త్వరలోనే ఒక కమిటీ వేసి వారికి కూడా గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ( మిగితా...2లో )



సూర్య
www.suryaa.com
సోమవారం 21 ఏప్రిల్ 2025

### భూ సమస్యల పరిష్కారానికే
# భూ భారతి చట్టం
### - అవగాహన సదస్సులో మంత్రి సీతక్క

**మొదటి పేజీ తరువాయి....**

ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ, రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. భూభారతి చట్టం ద్వారా సాదా బైనామా ప్రక్రియ తిరిగి వాడుకలోకి రానుంది అన్నారు. భూభారతి చట్టం కింద భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న భూ యజమానుల పట్టాదార్ పాసు పుస్తకాలలో వారి భూమికి సంబంధించిన వివరాలు మ్యాపుల రూపంలో పొందుపరచబడతాయన్నారు. ఈ పద్ధతితో భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేయబడతాయన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భూములకు సంబంధించి ఏవైనా వివాదాలు ఉంటే వాటిని తొలగించి, భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని




ప్రవేశపెట్టిందని అన్నారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందని సూచించారు. ధరణిలోని వివరాల ప్రకారం భూభారతి రికార్డులలో వాటిని నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే, రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చని సూచించారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీఓకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల భూమికి సంబంధించిన చిన్నచిన్న సమస్యలు మండల స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని కోణాలలో, మేధోమథనం చేసిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. భూ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ను మంత్రి ప్రారంభించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం
## అందుకోనున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**మొదటి పేజీ తరువాయి...**

ఈ అవార్డు ప్రధానంగా ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి , మౌలిక వసతులలో కొలిచే పురోగతి పై దృష్టి పెట్టింది, అన్ని 5 ప్రధాన అంశాల్లో సమగ్ర అభివృద్ధి సాధించినందుకు నార్నూర్ ప్రత్యేకంగా గుర్తించబడింది.మదింపు ప్రక్రియ అనేక దశలుగా జరుగుతుంది. మొదట పరిపాలన సంస్కరణలు , ప్రజా దర్యాప్తు శాఖ వద్ద సీనియర్ అధికారులతో సమగ్ర పరిచయం ద్వారా వివరణాత్మక ప్రదర్శనను ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత అధికారులు నార్నూర్ బెనిఫిషియరీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వాటి పై గ్రౌండ్ స్థాయిలో ప్రభావం తెల్సుకునే ఒక ప్రత్యేక కాల్ సెంటర్ రౌండ్ నిర్వహించారు.మూడవ దశలో అదనపు కార్యదర్శి స్థాయి ఇద్దరు అధికారులు నార్నూర్‌ను సందర్శించి,పథకాలు ఎలా అమలవుతున్నాయి, బ్లాక్ అంతటా వాటి ప్రభావాన్ని అంచనా వేసి భాగస్వాములతో సమావేశమయ్యారు. చివరగా ఈ పర్యవేక్షణ తర్వాత కేబినెట్ కార్యదర్శి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి మదింపు జరిగింది.వివిధ దశల సమగ్ర మదింపు తర్వాత నార్నూర్ బ్లాక్ ఏబిపి కింద టాప్ 5 బ్లాకులుగా ప్రకటించబడింది. సమగ్ర సుస్థిర అభివృద్ధి కొరకు ఒక ప్రామాణిక బలంగా నిలిచింది.జిల్లా కలెక్టర్ రాజర్షి షా కృషి ఎంతో ఉంది ఆయన తన దూరదర్శితమైన నాయకత్వంతో అహర్నిశలు కష్టపడి క్రింది స్థాయి అధికారులకు దిశ నిర్దేశం చేస్తూ నార్నూర్ బ్లాక్ అద్భుతమైన మార్పు ప్రగతి సాధించడంలో జిల్లా కలెక్టర్ క్రియాశీలక పాత్ర ఉండడం మూలంగా ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు.కలెక్టర్ మార్గదర్శకత్వంలో నార్నూర్ అనేక కీలక రంగాలలో ప్రగతిని సాధించింది.ఇందులో గర్భిణీ, శిశు ఆరోగ్యం, ప్రాథమిక శిశు సంరక్షణ, విద్యా ఫలితాలు, డిజిటల్,ఆర్థిక చేర్పు, గిరిజన సంక్షేమం, ద్వారా మోవా లడ్డు,సహజ వ్యవసాయం, మూడు దశల వ్యవసాయం, చెక్ డ్యామ్స్ నిర్మాణం,ఇంటర్వెన్షన్స్ (నార్నూర్ మానిటరింగ్ యాప్, వెబ్సైట్) మోడల్ సెంటర్, డిజిటల్ ఇండియా , గిరిజన పోషణ్ మిత్ర, వంటి నూతన ఆలోచనల ద్వారా జీవనోపాధి కూడా మంచి పురోగతి సాధించింది ప్రభుత్వ సహకారం తో పాటు , అనేక ఆసక్తి ఎన్ జి ఓ లు తమ వంతు భాగస్వామ్యం చేయడం వారు అందించిన సిఎస్ఆర్ ఫండింగ్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలుచేపట్టడం. ముఖంగా నార్నూర్ బ్లాక్ మరింత సుస్థిర అభివృద్ధివాధించింది. ప్రజా భాగస్వామ్యంతో ఈ విజయాన్ని సొంతం చేసుకుంది. డేటా ఆధారితతో అభివృద్ధికి చేయుత నివ్వడంలో సమగ్ర అభివృద్ధి ధృఢమైన నిదర్శనంగా నిలవడంతో దేశ వ్యాప్తంగా మారుమూల ఉన్న నార్నూర్ బ్లాక్ దేశవ్యాప్తంగా మార్పు తీసుకొచ్చే ఇతర ఆస్పిరేషనల్ బ్లాకుల కోసం ఒక ప్రేరణగా నిలిచింది.

ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి రాజర్షి షా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారం, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పంచాయతీ రాజ్ మహిళ శిశు సంక్షేమం జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు గేడం నగేష్, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా, ఆయా విభాగాల జిల్లా అధికారులు సంయుక్త సహకారం జిల్లా ఆస్పిరేషనల్ నార్నూర్ బ్లాక్ సంబంధిత అధికారులు, అస్పిరేషనల్ బ్లాక్ ప్రతినిధి రాహుల్ , మండల, మండల, గ్రామ అధికారులు అందరి సమిష్టి, సహకారంతో అవార్డును అందుకోవడం జరిగిందని, అందరి సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.ఇదే స్ఫూర్తి తో జిల్లా అభివృద్ధి తెలంగాణలోని అన్ని జిల్లాల కంటే అగ్రగామిగా నిలిచేందుకు మనందరం కలిసి కట్టుగా కృషి చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

### ప్రజలను దోచుకుంటున్న
## మెడికల్ షాపుల యాజమానులు
### - రోగులను పట్టిపీడిస్తున్న వైద్యులు

**మొదటి పేజీ తరువాయి...**

మరి కొంతమంది డాక్టర్లు తమ బంధువులతో మెడికల్ షాపులు తెరిపించి తమకు వచ్చే శాంపిల్స్ ను మెడికల్ షాపులలో అమ్మిస్తున్నట్లు తెలిసింది. అలాగే కొంతమంది మెడికల్ షాపులో యజమానులు బి ఫార్మసీ, డి ఫార్మసీ సర్టిఫికెట్లు లేకపోయినప్పటికీ ఇతరుల సర్టిఫికెట్లతో మెడికల్ షాపులు నడుపుతూ, సర్టిఫికెట్ ఇచ్చిన వ్యక్తికి నెలకు కొంత మొత్తాన్ని ముట్టచెప్పుతున్నట్లు తెలిసింది. అలాగే డాక్టర్లు సూచించిన దుకాణాల్లో మందులు కొనని రోగులను డాక్టర్లు కోపగించుకుంటున్నట్లు పలువురు తెలిపారు. అదేవిధంగా కొన్ని మెడికల్ షాపులలో నాసిరకం మందులు అమ్ముతున్న, ఔషధ నియంత్రణ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రతి నెల అధికారులకు ముడుపులు అందుతున్నందువల్లనే మెడికల్ షాపులను తనిఖీ చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే శాంపిల్స్ ను అమ్మకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ, కొన్ని మెడికల్ షాపులలో శాంపిల్స్ లభిస్తున్న అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మందులు విక్రయించకుండా ఒక్కొక్క దుకాణంలో ఒక్కొక్క దరకు విక్రయిస్తున్నారు. కొన్ని మందులపై ధర అమ్మకపు పన్ను ముద్రించి ఉండగా, అటువంటి ముద్ర లేని కొన్ని మందులను యజమానులు తమ ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముతూ రోగులను దోపిడీ చేస్తున్నారు. అలాగే మెడికల్ షాప్ లో యజమానులు ఒరిజినల్ బిల్లులు ఇవ్వకుండా ఖాళీ కాగితాలపై బిల్లు వేసి ఇస్తున్నారు. కొందరు మెడికల్ షాప్ యజమానులైతే పేదల అవసరం ఆసరా చేసుకొని ప్రిస్క్రిప్షన్ లేకుండానే డాక్టర్లలా సలహాలిస్తూ అడ్డగోలుగా మందులు విక్రయిస్తున్నారు. కనీసం డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అవసరం లేకుండా మందులు విక్రయిస్తున్న వారిపై అధికారులు నిఘాపెంచడం లేదంటూ విమర్శలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో గల కొన్ని ఆసుపత్రులలో చేతికి వేసుకునే ఒక్కో సూది 8 రూపాయల నుంచి 102 రూపాయల వరకు, అలాగే డెంగ్యూ రోగికి చేసే 40 రూపాయల ఇంజక్షన్ 400 రూపాయలకు అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. డెంగ్యూ, చికెన్ గున్యా రోగులకు ప్లేట్లెట్ లో పేరుతో మరింత దోపిడీ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులన్నీ డిఎం అండ్ హెచ్ ఓ క్రిందనే అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ ఉంటాయి. అన్ని రకాల పరీక్షల రేట్లు, మెడికల్ చార్జీల రేట్లు నోటీసు బోర్డులో పెట్టి రోగులకు తెలియపరచాల్సిన బాధ్యత ప్రైవేట్ హాస్పిటల్స్ పైన ఉంది. కానీ ఒక్కరు కూడా అనుసరించరు. వాస్తవంగా ప్లేట్లెట్స్ ఎక్కించడానికి అయ్యే ఖర్చు 11000 అప్పటికే చాలా ఎక్కువ అది, కానీ 18 వేల వరకు తీసుకుంటున్నట్లు తెలిసింది. అలాగే రక్త కణాలను విడగొట్టినందుకు 5000, కణాలను ఎక్కించినందుకు 13 వేల రూపాయల వరకు తీసుకుంటున్నట్లు పలువురు రోగులు తెలిపారు. అసలు విషయం ఏమిటంటే కొన్ని రకాల ప్రైవేట్ హాస్పిటల్స్ లో వైద్యులు యాంటీబయోటిక్స్ ద్వారా ఉన్న ప్లేట్లెట్స్ ను తగ్గించి, త్వరగా మీకు ప్లేట్లెట్స్ అవసరం ఉందని రోగులను భయభ్రాంతులకు గురిచేసి రోగులను పీల్చి పిప్పి చేసి లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ప్రచారం ఉంది. ఇకనైనా డ్రగ్ ఇన్స్పెక్టర్లు విజిలెన్స్ అధికారులు మెడికల్ షాపులపై నిఘా వేసి రోగులకు న్యాయం చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూద్దాం.

ఈ విషయంలో మంచిర్యాల డ్రగ్ ఇన్స్ పెక్టర్ అర్చనను ఫోన్లో సంప్రదించగా జిల్లాలోని అన్ని మండలాల్లో గల మెడికల్ షాపులలో విస్తృతంగా తనిఖీలు చేయడం జరిగిందని, అవకతవకలు మాత్రం ఎక్కడా జరగలేదన్నారు. శాంపిల్ లను మెడికల్ షాపులలో విక్రయించిన దాఖలాలు లేవన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం జరుగుతుందని అర్చన తెలిపారు.

### జన్నారంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**జన్నారం,ఏప్రిల్ 20,సూర్య మేజర్ న్యూస్ :**

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలో ఆదివారం



ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు కస్తూరి సతీష్ మాట్లాడుతూ సిగ్నేచర్ యాక్టివేట్ లో భాగంగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని, అదేవిధంగా ఈరోజు నుంచి 50 రోజులపాటు చల్లని మినరల్ వాటర్ ను మండల ప్రజలకు అందించడం జరుగుతుందని, ప్రతి మంగళవారం మజ్జిగ సైతం పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంతట విజయ్ కుమార్, జోన్ చైర్ పర్సన్ అంజిత్ రావ్, వైస్ ప్రెసిడెంట్ తోట లచ్చన్న, సభ్యులు బందారి మారుతి రాజ్, గుండ పవన్, జాజాల శ్రీనివాస్, అనుముల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

### ఇంద్రవెల్లి స్థూపం వద్ద నివాళులు అర్పించిన మంత్రి సీతక్క,ఎంపి,ఎమ్మెల్యేలు,ప్రజా ప్రతినిధులు

**మొదటి పేజీ తరువాయి...**

అంతకుముందు ఏప్రిల్ 20 1981లో పోలీసు కాల్పుల్లో అమరులైన వీరులకు ఆదివాసీ గిరిజనులు ఘనంగా నివాళు లర్పించారు. గోండు గూడ నుండి ప్రారంభమైన ర్యాలీ మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద చేరుకొని ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయబద్ధంగా పూజలు చేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల కుటుంబ సభ్యులతోపాటు గాయాలపాలైన బాధితులు నివాళులర్పించారు. వారి త్యాగాలను కొనియాడారు. సంస్మరణకు భారీ సంఖ్యలో గిరిజనులు తరలివచ్చారు. అమరవీరుల స్థూపం ఎదుట ఎరుపురంగుతో రెండు జెండాలను ఆవిష్కరించారు. వారి త్యాగాలను గుర్తు చేస్తూ కొనియాడారు.ఆదివాసీ గిరిజన అమరవీరులకు ఘన నివాళి అర్పించిన ప్రముఖులు, మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేష్ ,అదిలాబాద్ జిల్లా ఎస్పీ మహాజన్, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా , అడిషనల్ కలెక్టర్ యువరాజ్, మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ , ఎమ్మెల్సీ దండె విటల్ ,



ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు,కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ,తుడుందెబ్బరాష్ట్రనాయకులు గొడం గణేష్,ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పూర్క బాపురావు, రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్,అమరవీరుల ఆశయ సాధన సమితి అధ్యక్షుడు తోడసం నాగోరావు, కోట్నాక్‌బారిక్‌రావ్, నాయకుడు జుగాదిరావ్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, మెస్రం నాగ్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.సభలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గట్టి పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### పులాజీ బాబా ధ్యాన కేంద్రం

# 14 వ వార్షికోత్సవాలు

**కాసిపేట,ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్**

కాసిపేట మండలంలోని గట్రాపల్లి గ్రామపంచాయతీ పరిధి ఇప్పల గూడ లో గల శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పులాజీ బాబా ధ్యాన కేంద్రం 14 వ వార్షిక మహోత్సవాలు ఆదివారం, సోమవారం రెండు రోజులు జరగనున్నాయి. ఆదివారం ధ్యాన కేంద్రం 14 వ వార్షిక మహోత్సవాలను పురస్కరించుకొని బాబా భక్తులు ఆదివారం సాయంత్రం ధ్వజారోహణ చేశారు. అనంతరం హారతి చేసి ధ్యాన ధారణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి వివిధ ధ్యాన కేంద్రాల నుండి వచ్చిన భక్తులచే భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు గ్రంథ పూజ అనంతరం ముఖ్య సంస్థాన్ పట్నాపూర్ శాఖ నుండి వచ్చిన ముఖ్య అతిథుల చే అమృత వాణి ప్రవచన ఉంటుందని తెలిపారు. ఆదివారం జరిగిన ధ్వజారోహణ కార్యక్రమానికి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు బిజెపి ఎస్టీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్ పాల్గొన్నారు. ధ్యాన కేంద్రం అధ్యక్షులు పెంద్రం రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగగా గ్రామ పేటల్ రాయి సిడం తిరుపతి, భక్తులు వెడ్మ బాపురావ్, కుర్సెంగ అచ్యుత్ రావ్, రాయి సిడం రాము, కొమ్ముల బాపు, కనక రాము, కనక మన్కు, కనక మారు, మడవి తిరుపతి తదితర భక్తజనులు పాల్గొన్నారు.



## ఘనంగా విజేత పాఠశాల 15వ వార్షికోత్సవం

**ఖానాపూర్,ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్**

ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లో గల విజేత పాఠశాలలో శనివారం అంగరంగా వైభవంగా పాఠశాల 15వ వార్షికోత్సవ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ మా స్వంత భవనంలో విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. .ఈ కార్యక్రమానికి ముఖ్యదితిగా



హాజరైన పలువురు మాట్లాడుతూ, నేటి చిన్నారులే రేపటి పౌరులున్నారు. 15 ఏళ్లుగా విద్యార్థులకు తన వంతుగా విద్యానందిస్తూ, విద్యార్థులను పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో రాణించేలా ప్రోత్సహిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్ మరియు పాఠశాల సిబ్బంది నీ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. అనంతరం హాజరైన పలువురుకి శాలువాలతో ఘనంగా సన్మానించి,మేమేంటో లు అందజేశారు. ఈ వేడుకల్లో చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని అలరించారు. ఇందులోప్రముఖ రచయిత షియన్ సంపత్, నిర్మల్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్ రావు , టిఎన్‌జిఓ. రాష్ట్ర నాయకులు నాగరాజు, డాక్టర్ కిరణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, న్యాయవాదులు వెంకట మహేంద్ర, సుమిత్, శివ, ఖాజా, శేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, నంది రామయ్య, లక్ష్మీ నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

### - జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.

**నిర్మల్ ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్.**

జిల్లావ్యాప్తంగా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 వ తరగతుల్లో ఏర్పడిన విద్యార్థుల ఖాళీలను భర్తీ చేసేందుకై ఆదివారం జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్షను ఏర్పాటు చేశారు. నిర్మల్ లోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలో గల వసతులను ఆయన పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో సరైన లైటింగ్, మరుగుదొడ్లు, త్రాగునీరు, తదితర వసతులు సక్రమంగా ఉన్నాయో లేదో ఆయన పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈ పరీక్షకు సంబంధించి మొత్తం 808 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 721 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.ఈ పరీక్ష కేంద్ర తనిఖీలో డిఈఓ పి. రామారావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్,డిసిఓ గీత, పర్యవేక్షకులు రమణారెడ్డి, సిఎస్ దశరథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





### నేడు నస్పూర్ లో

# భూభారతి పై అవగాహన సదస్సు

**నస్పూర్, ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్:**

నస్పూర్ మండలంలోని సీతారాంపల్లి రైతు వేదికలో, సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు, భూభారతి పై అవగాహన సదస్సు ( కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం 2025) జరుగుతుందని, నస్పూర్ తాసిల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నస్పూర్ మండలంలోని ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు, భూసమస్యలు ఉన్నవారు కూడా, ఇట్టి సదస్సులో పాల్గొని వివరాలు తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం కు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మండల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొంటారని, కావున ఈ సదస్సును విజయవంతం చేయాలని నస్పూర్ ప్రజలను కోరారు.

## యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

**కాసిపేట, ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్**



కాసిపేట మండల యాదవ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కొండాపూర్ యాపలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా ముత్యాల రాజమౌళి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు శంకర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా రేశవేని ఓదెలు యాదవ్, కోశాధికారిగా ముత్యాల రాజన్న యాదవ్, ముఖ్య సలహాదారుడిగా దాడి గట్టయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తదితర యాదవులు పాల్గొన్నారు.

### కారు, బైక్ ఢీ

# .. ముగ్గురికి గాయాలు

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్**

లక్ష్మణచాంద మండలం కనకాపూర్, బాబాపూర్ గ్రామాల మధ్య కారు, బైకు ఢీ కొన్నాయి. కారులో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా.. బైక్ పైన ఉన్న సుంకే భూమరాజం, మానాల రాజేశ్వర్ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి దీపక్ పైలెట్ నవీన్ కుమార్ ప్రథమ చికిత్స చేసి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారు ఖానాపూర్ పట్టణానికి చెందినవారిగా గుర్తించారు.



## రైతులంతా సామరస్యంగా ఉన్నప్పుడే భూ సమస్యలకు పరిష్కారం

### - మండల తహసీల్దార్ సతీష్ కుమార్

**మందమర్రి, ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్.**

సహనం వహించి రైతులంతా సామరస్యంగా ఉన్నప్పుడే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మండల తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ అన్నారు. భూ సమస్యలను ఎటువంటి వివాదాలు లేకుండా తనదైన శైలిలో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి శాంతియుతంగా సామరస్యంగా పరిష్కరిస్తూన్నారు మందమరి మండల తహసిల్దార్ సతీష్ కుమార్. పెరుగుతున్న భూముల ధరలతో వివాదాలు కూడా ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రశాంతంగా ఉన్న పల్లెలో భూ సమస్యల వివాదాల శాతం ఎక్కువగా ఉంటోంది. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం మందమర్రి మండలంలో సాఫీగా కొనసాగుతోంది. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి భూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. శుక్రవారం మండలంలోని సారంగపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో మంద పద్మ కు సంబంధించిన తన భూమిలో హద్దులు నిర్ణయించాలని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోగా శుక్రవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి, సర్వేయర్ లతో కలిసి శుక్రవారం తహసిల్దార్ సతీష్ సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించిన బాధిత ఫిర్యాదు దారులు చేసే దరఖాస్తు ఆధారంగా 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తున్నట్లు తహసిల్దార్ సతీష్ తెలిపారు. ఇప్పటి వరకు మండలలో భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలోని పలు గ్రామాల నుండి స్వీకరించిన 6 దరఖాస్తులను పరిశీలించి సరిహద్దు వివాదాలు, భూ ఆక్రమణలు, ఆన్లైన్లో పేర్లు, వారసత్వంగా వచ్చే భూ పంపకాలు లాంటివి పరిష్కరించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపయోగించుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని రికార్డుల ఆధారంగా లబ్దిదారులకు న్యాయం చేస్తామని అన్నారు. పంతాలకు పోయి దాడులు, ప్రతి దాడులకు పాల్పడితే జైలు పాలు, ఆర్థిక ఇబ్బందులూ తప్ప సమస్యకు పరిష్కారం కాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**జన్నారం, ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్ :**

1982 - 83 బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జన్నారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. గత 40 సంవత్సరాల క్రితం జన్నారం బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకుని ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లంతా ఈరోజు ఒక చోటికి చేరుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ముందుగా పరమావధించిన గురువులు, తోటి సహచరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమ్మేళనానికి గురువులు సుధాకర్ రెడ్డి, మడిపల్లి దక్షిణామూర్తి, బేత జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

